క్లుప్తంగా

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎస్సీ,ఎస్టీ డివిజన్ లెవల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాంప్రసాద్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ గిరిజనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టీటీడీలో నామినేటెడ్ పదవులు కేటాయించడం హర్షించదగిన విషయమన్నారు. విశాఖపట్నంలో గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేశారన్నారు. గత పాలకులు గిరిజనులను కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూశారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దామోదరతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

బత్తలపల్లి: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందనలో ప్రజల నుంచి అందే అర్జీలపై దృష్టి సారించాలని తహసీల్దార్ యుగేశ్వరిదేవి పేర్కొన్నారు. 'స్పందన' కార్యక్రమాన్ని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించారు. వివిధ సమస్యలపై పది అర్జీలు అందినట్లు పేర్కొన్నారు. వాటిలో మూడు అర్జీలు భూ సమస్యపైన, సబ్‌డివిజన్ కోసం మూడు, రస్తా సమస్యపైన రెండు, పొజిషన్ సర్టిఫికెట్ కోసం రెండు అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సౌజన్యకుమారి, ఏపీఓ ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడిమర్రి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు సోమవారం 307 మంది వృద్ధులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కృష్ణప్రసాద్ నేత్ర దానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ హేమలత, ఎంపీహెచ్ఈఓలు మనోహర్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోండి



ఎంపీపీ శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఓ సౌజన్య

పుట్టపర్తి: బుక్కపట్నం కస్తూర్బా పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎస్ఓ సౌజన్య కోరారు. సోమవారం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డికి ఆమె వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎంపీపీ వెంటనే తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి సూచించారు. తాత్కాలికంగా బుచ్చయ్యగారిపల్లి పంచాయతీ నుంచి నీరు సరఫరా చేయాలన్నారు. వారం రోజుల్లో ఎంపీపీ నిధులతో బోరు వేస్తామన్నారు. కార్యక్రమంలో మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, మండల అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ వెంకట చౌదరి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి

తాడిమర్రి: మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆయన అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శివశంకర్ శర్మ, ఈఓపీఆర్డీ కామాక్షి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ లక్ష్మీలతో గ్రామాల్లోని తాగునీటి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీలో తాగునీటి సమస్య ఉన్నట్లు తెలిసిందన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు సమ్మెలో ఉన్నందున తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. సర్పంచులు, గ్రామ కార్యదర్శులతో మాట్లాడి సమస్య ఉన్న గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు.

సాగు 'యంత్రం'... సులభ మంత్రం

పుట్టపర్తి అర్బన్: వ్యవసాయ పనులు సకాలంలో పూర్తి చేయడానికి రైతన్నలు యంత్రాలపై ఆధారపడుతున్నారు. పెద్ద రైతులు వివిధ రకాల యంత్రాలను బాడుగలకు ఇస్తూ సహకరిస్తున్నారు. పెద్ద పంటల్లో మొదటిదైన వేరుశనగ సాగులో పొలం దున్నకం మొదలు చదును, తొలగించడం, పంట పూర్తయిన తరువాత నూర్పిడి వరకూ వివిధ రకాల పరికరాలను వినియోగిస్తున్నారు. కంది, సజ్జ, మొక్కజొన్న కంకులు, వరి పంటలను తొలగించడంతో పాటు గింజలు ఆడించేందుకు భారీ యంత్రాలను వినియోగిస్తూ త్వరితగతిన పనులు చక్కబెడుతున్నారు. విత్తన గొర్రు నుంచి నూర్పిడి వరకూ అన్ని యంత్రాలూ పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ అందుబాటులో ఉంటున్నాయి. కొంత మంది యువకులు నూర్పిడి కోసం వినియోగించే భారీ యంత్రాలను తమిళనాడు నుంచి అద్దెకు తీసుకొచ్చి సీజన్ ముగియగానే తిరిగి అప్పగిస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లాకు ఆనుకుని కర్ణాటక రాష్ట్రం ఉండడం, అక్కడ విస్తారంగా రాగి సాగు చేస్తుండడం వెరసి భారీ యంత్రాలకు భలే డిమాండ్ ఉంటోంది. ఇక.. త్వరలోనే డ్రోన్ల వ్యవసాయం అందుబాటులోకి రానుంది. వీటిపై పలువురికి శిక్షణ ఇస్తున్నారు. దీంతో ఎరువులు చల్లడం, మందులు పిచికారీ మరింత సులభతరం కానుంది.



వరి పంటను తొలగిస్తున్న భారీ యంత్రం



విత్తన గొర్రుతో వేరుశనగ విత్తుతున్న రైతన్న



వరి మడిలో చదును చేస్తున్న ట్రాక్టర్



పంటల నూర్పిడికి వినియోగించే వలసమణి



రైతులకు అందుబాటులోకి రానున్న డ్రోన్

బాధిత కుటుంబాలకు పరామర్శ

నల్లమాడ: మండలంలోని చెరువువాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వై.నీలకంఠారెడ్డి(42) గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోమవారం గ్రామానికి వెళ్లి మృతుడి భార్య మాధవి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్యపడవద్దని.. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. మృతుడి భార్యకు అంగన్‌వాడీ ఆయా ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, దుద్దుకుంట వెంకటరెడ్డి, కొక్కంటి సాంబశివారెడ్డి, నల్లమాడ టౌన్ కన్వీనర్ వేణుగోపాల్ గౌడ్, యువజన విభాగం మండల అధ్యక్షుడు కోనపల్లి నరసింహారెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు: ఓడీచెరువు మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మరణించిన పలువురు కుటుంబాలను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. పగడాలవారిపల్లిలో గురుకుల శ్రీనివాసరెడ్డి ఇంట్లో ఇటీవల జరిగిన చోరీలో ఎత్తుకెళ్లిన సొమ్మును వేగవంతంగా రికవరీ చేయాలని పోలీసులను ఆదేశించారు. దొన్నికోటవారిపల్లిలో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన రామాంజినేయులు కుటుంబీకులకు ఆర్థికసాయం అందజేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటనారాయణను పరామర్శించారు. చికిత్సల నిమిత్తం నగదు అందజేశారు. కొక్కంటివారిపల్లిలో మృతి చెందిన ఈశ్వర్‌రెడ్డికి నివాళి అర్పించి కుటుంబీకులకు భరోసా కల్పించారు.



మృతుడి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

సచివాలయాల ఆకస్మిక తనిఖీ

కదిరి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఎన్జీఓ కాలనీ సచివాలయం, సైదాపురం సచివాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆకస్మికంగా సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలపై చర్చించారు. హౌసింగ్, పెన్షన్లపై ఆరాతీశారు. మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను ఇప్పటి వరకు సచివాలయ పరిధిలోని ఎంత వసూలు అయ్యిందని అడిగి తెలుసుకున్నారు. పన్ను త్వరితగతిన వసూలు చేయాలన్నారు. చెత్త బండ్లు రాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన కమిషనర్‌తో మాట్లాడారు. వలంటీర్ పరిధిలో 18 ఏళ్లు పూర్తయిన వారికి ఓటరు నమోదు చేయించాలని వలంటీర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరిబాబు, వార్డు కౌన్సిలర్ రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పరికి సాదిక్ బాషా, బండారు మురళి, తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు

ధర్మవరం అర్బన్: శ్రావణ పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదర్శనకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామని ఆర్టీసీ డిపో మేనేజర్ మోతీలాల్‌నాయక్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎం మాట్లాడుతూ ఈనెల 30న శ్రావణ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ఉదయం 5 గంటలకు ధర్మవరం నుంచి బస్సు బయలు దేరుతుందన్నారు. కాణిపాకం మీదుగా అరుణాచలం గిరి ప్రదర్శన, శివుని దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో వేలూరు గోల్డెన్ టెంపుల్ మీదుగా కంచి దర్శించుకుని నేరుగా ధర్మవరానికి వచ్చేలా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. రానుపోను చార్జీ ఎక్స్‌ప్రెస్ బస్సుకు రూ.1200, సూపర్ లగ్జరీ బస్సుకు రూ.1600 టికెట్ ధర నిర్ణయించామన్నారు. వివరాలకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ 7382860947 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం మోతీలాల్‌నాయక్

అంధత్వ నివారణకే 'కంటి వెలుగు'

చెన్నేకొత్తపల్లి: అంధత్వ నివారణకు ప్రభుత్వం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ వైద్యులు ఉదయ్ తెలిపారు. సోమవారం స్థానిక ఆస్పత్రిలో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ డాక్టర్ మాట్లాడుతూ కంటి సమస్యలు ఉన్నవారు ప్రతి సోమవారం ఎన్ఎస్ గేటు ఆస్పత్రిలో నిర్వహించనున్న కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీవైడీఎం డాక్టర్ సేత్య, పారా మెడికల్ ఆఫీసర్ ఉరుకుందప్ప తదితరులు పాల్గొన్నారు.



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న వైద్యులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి, సుబ్బరాయనిపల్లి గ్రామాల్లో సోమవారం వైద్య సిబ్బంది పర్యటించారు. అక్కడక్కడ గ్రామసభలు పెట్టి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరాలతో బాధపడుతున్న వారిని పరీక్షించి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నగేష్, ఏఎంఓ లక్ష్మీనాయక్, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పీ రాధ, సుస్మిత, శివ, రాజశేఖర్, అజీజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



పరిసరాల శుభ్రతపై వివరిస్తున్న వైద్య సిబ్బంది

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

అమడగూరు: ఓడీచెరువు గ్రామ సచివాలయం-1 పరిధిలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. ఉదయం 7:30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరవుతారన్నారు.

అమరుల త్యాగాలను ఆదర్శంగా తీసుకోవాలి

కదిరి టౌన్: టీడీపీ హయాంలో విద్యుత్ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలను ఆదర్శంగా తీసుకుందామని సీపీఎం నాయకులు అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం వారు అమరులకు నివాళులర్పించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

కొత్తచెరువు/పుట్టపర్తి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాడుపడాలని రూరల్ అగ్రికల్చర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకుడు మదన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కొత్తచెరువు మండలంలోని తలమర్ల, బుక్కపట్నం మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో పర్యావరణంపై అవగాహన సమావేశం నిర్వహించారు. కొండ గుట్టలు, ఇళ్ల పరిసరాల్లో చెట్లు పెంచాలని సూచించారు. అనంతరం సిబ్బంది కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బషీరున్నీసా, తలమర్ల పాఠశాల హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.



పాఠశాల సిబ్బందికి కిట్లు అందిస్తున్న దృశ్యం

నేడు వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ఫైనల్

నల్లచెరువు: మండల కేంద్రంలోని తాటిచర్ల బ్రదర్స్ మైదానంలో మంగళవారం వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్ బీసీ వారియర్స్ వర్సెస్ కప్పల్ టీమ్ మధ్య నిర్వహించనున్నారు. ఈ మేరకు టోర్నీ నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫైనల్ మ్యాచ్ వీక్షించడానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తల వెంకటరమణ హాజరుకానున్నట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

గాండ్లపెంట: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అన్ని ఫీడర్లు ఒకే సారి వినియోగించడంతో అధిక లోడు వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని ఎల్ఐ నరసింహులు సోమవారం తెలిపారు. మలమీదపల్లి ఫీడర్‌లో వ్యవసాయానికి తెల్లవారుజామున 2గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు, మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. కటారుపల్లి, జీనులకుంట, వేపలకుంట ఫీడర్లలలో ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు మొత్తం 9 గంటల విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

వేరుశనగ రైతులను ఆదుకోవాలి

కనగానపల్లి: ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసి వర్షాభావంతో పంట ఎండిపోయి నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండల సీపీఎం నాయకులు, రైతులతో కలిసి పలు గ్రామాల్లో వేరుశనగ పంట పరిశీలించారు. గత రెండు నెలలుగా వర్షాలు సరిగా రాకపోవటంతో ఖరీఫ్‌లో వేరుశనగ పంట పూర్తిగా ఎండిపోతోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కదిరప్ప పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గాండ్లపెంట: మండలంలోని వద్దిరెడ్డిపల్లికి చెందిన అజ్జుగుంటి భాస్కర్‌రెడ్డి (64) ఈ నెల 24న ద్విచక్ర వాహనం ఢీ కొని బెంగళూరులో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మండల కేంద్రానికి సమీపంలోని కదిరి - రాయచోటి ప్రధాన రహదారి పక్కన ఉన్న వాటర్‌ప్లాంట్ నుంచి భాస్కర్‌రెడ్డి టీవీఎస్ ఎక్సెల్‌పై రోడ్డు దాటుతుండగా గాండ్లపెంట వైపు నుంచి కదిరికి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన వృద్ధుడిని మెరుగైన చికిత్సకోసం బెంగుళూరుకు తరలించగా.. అక్కడ మృతి చెందాడు.

విద్యుత్ కోతలు లేకుండా చర్యలు

ధర్మవరం: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఐదు రోజులుగా విద్యుత్ సమస్య నెలకొందని, ప్రస్తుతం సమస్య పరిష్కరించామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోనున్న కనుముక్కల 33 కేవీ లైన్ ఫీడర్లను ఓ రైల్వే కాంట్రాక్టర్ డామేజ్ చేయడం వల్ల విద్యుత్ సమస్య తలెత్తిందన్నారు. విద్యుత్ అధికారులు ఆ సమస్యను గుర్తించి పరిష్కరించారన్నారు. కనుముక్కల 33 కేవీ లైన్ లైన్‌ను ఎస్ఎస్‌గేట్ 33 కేవీ ఫీడర్‌కు కలపడం జరిగిందన్నారు. దీంతో అదనంగా ఐదు సబ్‌స్టేషన్ల విద్యుత్ పంపిణీ అధిక భారం ఎన్ఎస్‌గేట్ సబ్‌స్టేషన్‌పైన పడిందని తెలిపారు. మరమ్మతులు చేసి యథాప్రకారంగా మంగళవారం నుంచి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ముమ్ముందు ఇలాంటి సమస్యలు రాకుండా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించామని పేర్కొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణాలు పూర్తి చేయాలి

కొత్తచెరువు: మండలంలోని జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ సిద్ధారెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, హౌసింగ్, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రమణారెడ్డి, ఏపీఓ నాగిరెడ్డి పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

బత్తలపల్లి: వెంటనే జీతాలు చెల్లించాలంటూ సత్యసాయి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని మంచినీటి ట్యాంకు వద్ద మండలంలో పని చేస్తున్న సత్యసాయి కార్మికులు కళ్లకు నల్లటి గుడ్డలు కట్టుకుని నిరసన చేపట్టారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జగన్ మారుతి, మహబూబ్‌బాషా, షేక్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చిదంబరరెడ్డికి గిడుగు పురస్కారం

హిందూపురంటౌన్: తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పురస్కారానికి పట్టణానికి చెందిన కవి, రచయిత సడ్లపల్లి చిదంబరరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు విజయబాబు లేఖ ద్వారా పేర్కొన్నారు. ఈనెల 29న తెలుగు భాషా వికాస వారోత్సవాల్లో భాగంగా విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో పురస్కారాన్ని అందజేయనున్నారు.

సెక్యూరిటీ గార్డుల ఆందోళన

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని స్ప్రింగ్ అండ్ ఎనర్జీ అనుబంధ కంపెనీ అయిన మహేంద్ర సోలార్ ప్లాంట్‌లో విశ్వం సెక్యూరిటీ ఏజన్సీ కింద విధులు నిర్వహించే సెక్యూరిటీ గార్డులు సోమవారం ఆందోళన చేశారు. ఇన్వాయిస్ ప్రకారం జీతాలు చెల్లించే విషయమై సెక్యూరిటీ గార్డులు కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. కంపెనీ యాజమాన్యం స్థానికేతరులకు అవకాశం కల్పించారని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న స్థానిక సింగిల్ విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి సోలార్ ప్లాంట్ వద్దకు చేరుకొని సెక్యూరిటీ గార్డుల సమస్యలపై ఆరా తీశారు. అనంతరం బాధిత సెక్యూరిటీ గార్డులు కదిరిలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు చేరుకొని తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే.. సెక్యూరిటీ ఏజెన్సీ వారితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి నేడు భూమి పూజ

కదిరి అర్బన్: మండలంలోని వరిగిరెడ్డిపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి మంగళవారం ఉదయం 10 గంటలకు భూమిపూజ చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రకాష్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హాజరవుతారన్నారు.

నేడు ఉపాధి పనులపై ప్రజా వేదిక

బత్తలపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రజా వేదిక బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సౌజన్యకుమారి, ఏపీఓ ఆదెప్ప తెలిపారు. మండలంలో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జరిగిన వివిధ పనులపై సామాజిక తనిఖీలు పూర్తయ్యాయన్నారు. గుర్తించిన అంశాలపై ప్రజా ప్రతినిధులతో మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో ప్రజా వేదిక ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు హాజరు కావాలని కోరారు.

వీఓఏ అధ్యక్షురాలిగా రామలక్ష్మి

బత్తలపల్లి: మండలంలో పని చేస్తున్న వీఓఏ (యానిమేటర్లు)కు ఉద్యోగ భద్రత కల్పించాలని యానిమేటర్లు తహసీల్దార్, ఎంపీడీఓ, ఏపీఎంలకు వినతిపత్రం అందజేశారు. సోమవారం మండలంలోని తహసీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీఓ సౌజన్యకుమారి, ఏపీఎం సుదర్శన్‌రాజులను ఆయా కార్యాలయాలలో యానిమేటర్లు కలిసి తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు మండలంలోని వీఓఏలు 45 మంది సమావేశమై వివిధ అంశాలపై తీర్మానం చేశారు. అనంతరం వీఓఏల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రామలక్ష్మీ, ఉపాధ్యక్షురాలిగా రమాదేవి, కార్యదర్శిగా బండి ఆదినారాయణ, సహాయ కార్యదర్శిగా వీరనారప్పలను ఎన్నుకున్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

తాడిమర్రి: మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ విజయలక్ష్మీ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆమె ఈఓపీఆర్డీ ఖాదర్‌బాషా, గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని బోర్లలో తాగునీరు అడుగంటి పోయే పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అందులో భాగంగా అవసరం ఉన్న చోట్ల ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు మంజుల, రమాదేవి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీచెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు



ధర్మవరం అర్బన్: పట్టణంలోని అతి పురాతన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం శ్రావణమాసం శుక్లపక్ష ద్వాదశి సందర్భంగా చెన్నకేశవస్వామి, మహాలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రాతఃకాల ఆరాధనలు చేసిన అనంతరం పంచామృతాభిషేకం చేశారు. అనంతరం పట్టువస్త్రాలు, తిరు ఆభరణాలు, వివిధ వర్ణమయ పుష్పాల అలంకరణ చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి సతీమణి సుప్రియ

ముదిగుబ్బ: మండల కేంద్రానికి చెందిన బాధిత కుటుంబానికి సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సతీమణి సుప్రియ ఆర్థిక సాయం చేశారు. మండల కేంద్రంలోని 8వ వార్డుకు చెందిన బేల్దారి శ్రీనివాసులు ఈ ఏడాది జూలై 21న గుండెపోటుతో మృతి చెందారు. బాధితులను ఆదుకోవడంలో భాగంగా సోమవారం ధర్మవరంలోని ఎమ్మెల్యే నివాసంలో మృతుని భార్య గీతకు ఎమ్మెల్యే సతీమణి రూ.20 వేలు నగదును అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రామంజి, లీవేష్, గంగాధర్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పని దినాలు పెంచాలి

కనగానపల్లి: ఉపాధిహామీ కూలీలకు 200 రోజుల పనిదినాలు పెంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు మహదేవ్ అధికారులను కోరారు. దీనిపై సోమవారం స్పందన కార్యక్రమంలో ఎంపీడీఓ అలివేలమ్మకు వినతిపత్రం అందించారు. రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు కల్పించే పని దినాలను 100 నుంచి 200 రోజులకు పెంచాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బాలరాజు, గోవిందు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.